


# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 మంగళవారం 08-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్

- భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు
- సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి
- అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం
- ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్

2లో



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై

## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత



- కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్
- కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారని కవిత మండిపాటు
- కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరిక

తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ - మిగతా 2 లో

## మంత్రివర్గంలోకి మహేశ్ గౌడ్

## కొత్త పీసీసీ చీఫ్ ఎవరు?

- ఈ నెలాఖరులోగా తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం
- మంత్రివర్గంలోకి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ చేరిక దాదాపు ఖాయం
- కొత్త పీసీసీ చీఫ్ రేసులో పొన్నం ప్రభాకర్, బలరాం నాయక్ పేర్లు
- మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ నేతల గట్టి ప్రయత్నాలు
- అసెంబ్లీ సమావేశాల తర్వాత ఢిల్లీలో అధిష్ఠానం తుది నిర్ణయం



తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెలాఖరులోగా - మిగతా 2 లో

## పీసీబీపై ఇమ్రాన్ ఖాన్ కుమారుల తీవ్ర విమర్శలు.. లార్డ్స్ టెస్టు వివాదంపై ఫైర్

- లార్డ్స్ టెస్టు వివాదంపై పీసీబీని తప్పుబట్టిన ఇమ్రాన్ ఖాన్ కుమారులు
- తమ ఇంటర్వ్యూ ప్రసారం ఆపాలని పీసీబీ బెదిరించిందన్న ఆరోపణ
- పీసీబీ తమను తాము ఫూల్స్‌గా మార్చుకుందని ఘాటు వ్యాఖ్య
- జైల్లో ఇమ్రాన్‌ను నెమ్మదిగా చంపేయాలని చూస్తున్నారన్న సంచలన ఆరోపణ
- తండ్రి ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సులేమాన్, ఖాసిం



పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ కుమారులు సులేమాన్, ఖాసిం.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన లార్డ్స్ టెస్టు సందర్భంగా పీసీబీ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ, వారు తమను తాము ఫూల్స్‌గా - మిగతా 2 లో

## ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు

- విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం
- జకార్తాను కమ్మేసిన బూడిద మేఘాలు
- 300కు పైగా విమాన సర్వీసులు రద్దు
- వేలాది అడుగుల ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద, ధూళి
- సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేసిన ఇండోనేషియా అధికారులు
- బూడిద కారణంగా పలుచోట్ల పాఠశాలలకు సెలవులు, జనజీవనంపై ప్రభావం



ఇండోనేషియాలోని అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. శుక్రవారం రాత్రి నుంచి ఉగ్రరూపం దాల్చిన ఈ అగ్నిపర్వతం - మిగతా 2 లో

## ధర్నాలు మాని అసెంబ్లీకి రండి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం



2లో

- బీఆర్ఎస్ నాయకత్వం దిశానిర్దేశం కోల్పోయిందన్న శ్రీధర్ బాబు
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని వెల్లడి
- బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శ

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా వాళ్లంతా బయటకొచ్చారు

- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని
- 2008 ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కరోనా, యుద్ధం వంటి సంక్షోభాలను తన ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని వెల్లడి
- భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ఆశలు నెరవేరడం లేదని వ్యాఖ్య

2లో



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో - మిగతా 2 లో

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు క్లారిటీ ఇచ్చిన ఇస్రో



- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది - మిగతా 2 లో

## తిరుమలలో భక్తజన సంద్రం.. సర్వదర్శనానికి 24 గంటలు!



- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు
- శనివారం ఒక్కరోజే స్వామివారిని దర్శించుకున్న 84 వేల మంది భక్తులు
- నిన్న రూ.4.08 కోట్లుగా నమోదైన శ్రీవారి హుండీ ఆదాయం

తిరుమల పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడుతోంది. వారాంతపు - మిగతా 2 లో

## ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి



- టీడీపీ నేత వసంత్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నారా లోకేశ్
- చిత్తూరు జిల్లా పెద్దకాల్వ గ్రామంలో లోకేశ్ పర్యటన
- వసంత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు
- పార్టీకి ఆయన సేవలను గుర్తు చేసుకున్న లోకేశ్

కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ - మిగతా 2 లో

## పెన్షనర్లకు చంద్రబాబు భారీ ఊరట

- అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ.. ఉద్యోగులకు కీలక హామీలు
- గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ
- 12వ పీఆర్సీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం
- పెండింగులో ఉన్న రెండు డీఏల విడుదలకు గ్రీన్ సిగ్నల్
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం వెల్లడి
- ప్రభుత్వ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాల నేతలు

2లో



రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ ఊరట కల్పించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 'అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్'ను పునరుద్ధరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ సంఘాలతో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. దీనితో పాటు ఉద్యోగులు ఎదురుచూస్తున్న పలు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా ముఖ్యమంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూనే, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం, 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు

## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

మొదటిపేజీ తరువాయి – చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## మంత్రివర్గంలోకి మహేశ్ గౌడ్.. కొత్త పీసీసీ చీఫ్ ఎవరు?

మొదటిపేజీ తరువాయి – కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించి, ఖాళీగా ఉన్న మూడు బెర్తులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విస్తరణలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. మహేశ్ గౌడ్ రెండేళ్ల పీసీసీ అధ్యక్ష పదవీకాలం ఈ నెల 15తో ముగియనుండటంతో, ఆయనను కేబినెట్‌లోకి తీసుకుని పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్ఠానం యోచిస్తోంది. కొత్త పీసీసీ చీఫ్ రేసులో మంత్రి పొన్నం ప్రభాకర్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు, మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నాయని చర్చ నడుస్తోంది. సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి, మహిళా కోటాలో నలమాద పద్మావతీ రెడ్డి కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కోరుతున్నారు. అయితే ఆయన సోదరుడు వెంకటరెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ అధిష్ఠానం తుది విడత చర్చలు జరపనుంది. ఆయన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేశ్ గౌడ్‌లను కూడా ఢిల్లీకి పిలిపించి మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

## ధర్నాలు మాని అసెంబ్లీకి రండి.. సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం పూర్తిగా దిశానిర్దేశం కోల్పోయి పక్కదారి పడుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. రోడ్లపై అనవసర ధర్నాలు, మీడియా ముందు మాట్లాడటం మాని నేరుగా అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము ప్రతీదానికీ సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతల కుటుంబ సభ్యులు కూడా వినియోగించుకోవడం లేదా? అని శ్రీధర్‌బాబు నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాయని, ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొడతారని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు. రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావులు.. గతంలో వారి ప్రభుత్వ హయాంలో ఇవే హామీలపై కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేకపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా వైఖరి మార్చుకోకపోతే, భవిష్యత్తులోనూ వీధుల్లోనే మిగిలిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు

మొదటిపేజీ తరువాయి – నుంచి వెలువడుతున్న బూడిద, ధూళి మేఘాల కారణంగా రాజధాని జకార్తాలో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముందుజాగ్రత్త చర్యగా సోకర్నో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో 300కు పైగా విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద ఆదివారం ఉదయం జకార్తా విమానాశ్రయ పరిసరాలను కమ్మేసింది. దీంతో అధికారులు తొలుత ఉదయం 9:30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం 5:30 గంటల వరకు విమాన రాకపోకలను నిలిపివేశారు. మొత్తం 301 విమానాలను రద్దు చేయగా, వాటిలో 58 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. ఈ పరిణామంతో 22,000 మందికి పైగా ప్రయాణికులపై ప్రభావం పడింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్ వంటి సంస్థలు జకార్తాకు తమ సర్వీసులను రద్దు చేసుకున్నాయి. సింగపూర్, దోహా, సిడ్నీ, కౌలాలంపూర్ వంటి ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. అగ్నిపర్వతం నుంచి బూడిద మేఘాలు జావా వైపు 20,000 అడుగులు, సుమత్రా వైపు 50,000 అడుగుల ఎత్తు వరకు వ్యాపించాయి. నిరంతర భూ ప్రకంపనలు, లావా వెదజల్లడం, భారీ శబ్దాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. బూడిద కారణంగా కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మత్స్యకారులు కూడా సముద్రంలోకి వేటకు వెళ్లలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు, కళ్లజోళ్లు తప్పనిసరిగా ధరించాలని ఇండోనేషియా విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. ప్రస్తుతానికి సునామీ ముప్పు ఏదీ లేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ప్రజల్లో ఆందోళన నెలకొంది. 2018లో ఇదే అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా సంభవించిన సునామీలో 400 మందికి పైగా మరణించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ అగ్నిపర్వతాలు, భూకంపాలు సంభవించడం సాధారణమే.

## తిరుమలలో భక్తజన సంద్రం.. సర్వదర్శనానికి 24 గంటలు!



మొదటిపేజీ తరువాయి – సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపలికి విస్తరించి బాట గంగమ్మ ఆలయం వరకు చేరుకున్నాయి. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనానికి గంటల తరబడి సమయం పడుతోంది. ఆదివారం ఉదయం 8 గంటల తర్వాత సర్వదర్శనం క్యూలైన్లలో ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం లభించేందుకు సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. అదేవిధంగా, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 4 నుంచి 6 గంటలు, సర్వదర్శనం టోకెన్లు పొందిన భక్తులకు 5 నుంచి 7 గంటల సమయం పడుతుందని వివరించారు. తిరుమలలో నెలకొన్న రద్దీ తీవ్రతను శనివారం నాటి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నిన్న ఒక్కరోజే మొత్తం 84,166 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 36,673 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి రూ.4.08 కోట్ల ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీకి అనుగుణంగా టిటిడి అధికారులు 4.74 లక్షల లడ్డూలను విక్రయించారు.

## అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్

మొదటిపేజీ తరువాయి – ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది. ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు. "ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు. అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

## పీసీబీపై ఇమ్రాన్ ఖాన్ కుమారుల తీవ్ర విమర్శలు లార్డ్స్ టెస్టు వివాదంపై ఫైర్

మొదటిపేజీ తరువాయి – మార్చుకున్నారని ఘాటుగా విమర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టు మొదటి రోజు, స్కై స్పోర్ట్స్ ఛానెల్‌లో ఇమ్రాన్ కుమారులు సులేమాన్, ఖాసింల ఇంటర్వ్యూ ప్రసారమైంది. మాజీ ఇంగ్లండ్ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో, వారు జైల్లో ఉన్న తమ తండ్రి క్షీణిస్తున్న ఆరోగ్యం, జైలు పరిస్థితులపై మాట్లాడారు. ఈ ఇంటర్వ్యూ ప్రసారాన్ని నిలిపివేయకపోతే లంచ్ విరామం తర్వాత బరిలోకి దిగబోమని పీసీబీ బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. ఈ వివాదంపైనే ఇమ్రాన్ కుమారులు స్పందించారు. "వారు (పీసీబీ) తమను తాము పూర్తిగా ఫూల్స్‌గా మార్చుకున్నారు" అని ఖాసిం వ్యాఖ్యానించారు. పీసీబీ స్పందన చూసి షాక్‌కు గురయ్యానని సులేమాన్ అన్నారు. "మా ఇంటర్వ్యూను తొలగించాలని పీసీబీ కోరడం వారి పరిధిలో లేదు. మేం మాట్లాడింది రాజకీయాల గురించి కాదు, మానవతా దృక్పథంతో ఆయన ఆరోగ్యం గురించే" అని సులేమాన్ వివరించారు. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో, ఇమ్రాన్ భద్రతపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "జైల్లోనే ఆయన్ను చంపేయాలని వారు స్పష్టంగా చూస్తున్నారు. వీలైనంత రహస్యంగా ఆయన్ను నిశ్శబ్దం చేసి, నెమ్మదిగా కనుమరుగు చేయాలని ప్రయత్నిస్తున్నారు" అని వారు సంచలన ఆరోపణలు చేశారు. అయితే, ఇమ్రాన్ ఖాన్‌కు పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నామని, ఆయనపై దుష్ప్రవర్తన ఆరోపణలను పాకిస్థాన్ అధికారులు ఖండిస్తూ వస్తున్నారు. ఈ వాదనలను సులేమాన్ తోసిపుచ్చారు. "ప్రభుత్వ వర్గాలు చెప్పే మాటల్లో పారదర్శకత లేదు. మాకు ఎలాంటి ఆధారాలు చూపించడం లేదు. అలాంటప్పుడు మేం ఎలా నమ్మాలి? ఆరు నెలల క్రితం తన కంటి సమస్య గురించి ఆయనే స్వయంగా మాట్లాడారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యంపై మాకు ఎలాంటి స్పష్టమైన సమాచారం లేదు" అని సులేమాన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

మొదటిపేజీ తరువాయి – రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.



**భవిష్యత్ లక్ష్యాలు ఇవే..**

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా.. వాళ్లంతా బయటకొచ్చారు

మొదటిపేజీ తరువాయి – ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు. "అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు. గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు. అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు. తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్-19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు ప్రధాని హోదాలో అదే వేదికపై నుంచి ప్రసంగించడం గమనార్హం.

## పెన్షనర్లకు చంద్రబాబు భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి – 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ అందనుంది. ఉద్యోగుల చిరకాల డిమాండ్ అయిన 12వ పే-రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుకు కూడా సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలలో రెండింటిని విడుదల చేయడానికి అంగీకరించారు. 1-7-2024, 1-1-2025 తేదీలకు చెందిన ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసులకు ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరాకే చెల్లించేందుకు సుముఖత చూపారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్)ను క్రమబద్ధీకరించి, వచ్చే నెల నుంచే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుంది.

**గత పాలనలో ఉద్యోగులకు అవమానాలు: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు... పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం.

## ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి







మొదటిపేజీ తరువాయి – వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఇటీవల కన్నుమూసిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్ కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాల్వ గ్రామంలోని వసంత్ కుమార్ నివాసానికి వెళ్లిన లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ చిత్రపటానికి లోకేశ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన లోకేశ్, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

# కనీస వేతన సలహా మండలిలో సిఐటియుకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని ఖండిస్తూ నిరసన



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 7 :** ఈరోజు అంబేద్కర్ సెంటర్ లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్ టియుసి సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడా న్ని నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి వీరస్వామి, సాయిలు, రాజు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోనకల్ గ్రామపంచాయతీలో సర్వే నోటీస్ హియరింగ్ పరిశీలించిన సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్



**జన్నారం/పోనకల్ సెప్టెంబర్ 7 (పోరు తెలంగాణ):** ఈరోజు పోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న సర్వే నోటీస్ హియరింగ్ ప్రక్రియను గ్రామ సర్పంచ్ శ్రీమతి జక్కు సుష్మ భూమేష్ గారు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వినతులను ఆరా తీసి, ప్రక్రియ సరళిని తెలుసుకున్నారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా సర్వే ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య గారు, సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ గారు, ఉపసర్పంచ్ జలపతి గారు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రేగొండ రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# క్రీడలే యువతకు మార్గదర్శకం

హనుమంత్ రెడ్డి సేవలు ఆదర్శం మాద్రి పృథ్వీరాజ్.



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువ కిషోర్ పటాన్చెరు నియోజకవర్గం సెప్టెంబర్ 7 :** క్రీడల పట్ల అంకితభావం, యువతకు మార్గదర్శకత్వం అందించడంలో హనుమంత్ రెడ్డి సేవలు ఈ తరం యువతకు స్ఫూర్తిదాయకం. సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం చేస్తూనే, ఎన్నో సంవత్సరాలుగా మైత్రి క్రికెట్ అసోసియేషన్ తర్వాత జనరల్ సెక్రటరీగా, అధ్యక్షుడిగా, క్రికెట్ మరియు క్రీడాభివృద్ధికి విశేష సేవలు అందించారు. రంజీ క్రికెట్ స్థాయికి ఎదిగి, స్పోర్ట్స్ కోటాలో రైల్వే ఉద్యోగం పొందడం ఆయన క్రీడా ప్రయాణానికి నిదర్శనం. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మైత్రి మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ హనుమంత్ రెడ్డి ని కలిసి పుష్పగుచ్ఛం అందించి, హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం కూడా మైత్రి మైదానం ద్వారా యువ క్రీడాకారులకు మార్గనిర్దేశం చేస్తూ, మరెందరో ప్రతిభావంతులను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

# తుక్కుగూడలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు



**మహేశ్వరం, సెప్టెంబర్ 7, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** అసెంబ్లీ వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ తుక్కుగూడ పట్టణ కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు దగ్ధం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ నిరసన తెలిపేందుకు వెళ్లిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు అనుసరించిన తీరును బీఆర్ఎస్ పార్టీ నేతలు తప్పు పట్టారు. ప్రజా పాలనలో మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీకి ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీని అణచవేసేందుకు చూస్తుందని వారు ధ్వజమెత్తారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలకు క్షమాపణలు తెలపాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు జె. లక్ష్మయ్య, యూత్ అధ్యక్షుడు సామెల్ రాజు, మాజీ కౌన్సిలర్ బాదావత్ రవి నాయక్, నాయకులు ఉప్పు నూతల శ్రీనివాస్, యాదగిరి, హరికృష్ణ రెడ్డి, బంటు రమేష్ ముదిరాజ్, శ్రీనివాస్, రాజు, శివ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా 3ఖ రన్ రన్ ఫర్ నేచర్ సీజన్-2

ఎం డి ఆర్ ఫౌండేషన్ పృథ్విరాజ్ ఆధ్వర్యంలో.






**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువ కిషోర్ పటాన్చెరు నియోజకవర్గం సెప్టెంబర్ 7 :** పటాన్‌చెరు కాలుష్యరహిత పటాన్‌చెరు లక్ష్యంగా ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3ఖ రన్ -పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరు సీజన్-2 రన్ ఫర్ నేచర్ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. జేపీ ఫార్మ్స్, ORR సర్వీస్ రోడ్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా అవసరం. కాలుష్యరహిత పటాన్‌చెరు ఒక్కరి లక్ష్యం కాదు. మనందరి సమిష్టి సంకల్పం అన్నారు. మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు, మొక్కలు అందజేశారు. కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు శాఖ, పరిశ్రమలు, వాలంటీర్లు, ప్రజలకు పృథ్వీరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ముదిరాజ్ లను బి సి డీ నుండి బీసీ ఏ లోకి మార్చాలి

తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్..



**మహేశ్వరం, సెప్టెంబర్ 7, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** ముదిరాజ్ లను బి సి డీ నుండి బీసీ ఏ లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్ తెలిపారు. ముదిరాజ్ సమాజం సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అధ్యయనం నిర్వహించి జనాభా, ఉద్యోగాలు, విద్య, ఆర్థిక స్థితి ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణలో ముదిరాజ్ సమాజం సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని తెలిపారు. ముదిరాజులకు రావాల్సిన స్థాయిలో విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. తెలంగాణ రాష్ట్రంలో కుల గణాంకాల ఆధారంగా ముదిరాజ్, ముత్రాసి, తెనుగోలు సమూహానికి 26 లక్షల పైగా జనాభా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జనాభాకు అనుగుణంగా విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బీసీ కమిషన్ ద్వారా సమగ్ర అధ్యయనం నిర్వహించి రాజ్యాంగబద్ధమైన విధానంలో ముదిరాజ్ సమాజానికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ముదిరాజ్ సమాజానికి సామాజిక న్యాయం సమాన అవకాశాలు తగిన ప్రాతినిధ్యం కల్పించడం కోసం న్యాయమైన పోరాటాలు చేస్తామని అన్నారు. ముదిరాజులను బిసి డీ నుండి బీసీఏలోకి చేర్చే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ముదిరాజ్ సమాజానికి దక్కాల్సిన హక్కులు వచ్చే వరకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని మహేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

# కోతుల బెడద నివారించాలని ప్రజావాణిలో దరఖాస్తు అందజేత

సర్పంచ్ రాగిడి మంగా శ్రీనివాసరెడ్డి



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించగా జీలకుంట గ్రామ సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాస్ రెడ్డి కోతల బెడదను నివారించాలని దరఖాస్తు సమర్పించారు. ఓదెల మండలంతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల్లో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఓదెల మండలం జీలకుంట ప్రాంతంలో అధిక సంఖ్యలో కోతులు సంచరిస్తూ, ఇంటి తలుపులు తెరుచుంటే చాలు లోనికి ప్రవేశించి మనుషుల మీద దాడి చేస్తున్నాయి ..అంతేకాదు నిత్యవసర సరుకులు,పప్పులు, కూరగాయలు, తీసుకు వెళ్లడమే కాకుండా పిల్లలు, వృద్ధులపై దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల సంఖ్య పెరగడంతో ప్రజలు ఇంటి తలుపులు మూసి వేసుకొని ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.. అంతేకాదు పంటలకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి .. తాజాగా కోతుల దాడిలో జీలకుంట సర్పంచ్ రాగిడి మంగ సైతం గాయపడ్డారు ..కోతుల నుంచి తనకే రక్షణ లేకపోతే గ్రామస్తులని ఎలా రక్షిస్తానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు ..ఈ విషయమై ఆమె అధికారులకు సమాచారం అందించి, వినతి పత్రాలు అందించారు . ప్రజలు నివాసం ఉంటున్న ఇండ్ల మధ్య ఇంటి పైన గుంపులు గుంపులుగా కోతులు సంచరిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆందోళన , నిస్సహాయత వ్యక్తం చేశారు . అధికారులు ఇప్పటికైనా స్పందించి కోతుల బెడద లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కోతుల సంతానం దినదిన ప్రవర్తన పెరుగుతుందని ..ప్రభుత్వం అన్ని గ్రామాల్లో కోతులని పట్టుకుని కోతులకు సంతాన ఉత్పత్తి జరగకుండాఆపరేషన్ చేయాలని ఆమె పేర్కొన్నారు..కోతులతో పాటు కుక్కలా సైతం వీరవిహారం చేసి భయాందోళనలకు గురి చేస్తున్నాయి ..పిల్లలు వీధుల్లో తిరగాలంటేనే భయపడుతున్నారు..ఇప్పటికే కొందరు గ్రామస్తులు కుక్కల దాడుల్లో గాయపడ్డారు ..కుక్కల దాడుల వాళ్ళ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు ..కుక్కలు , కోతుల సమస్య ఇలానే ఉంటె గ్రామస్తులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితులు నెలకొంటాయని ..ఈ సమస్యని తక్షణమే పరిష్కరించాలని సర్పంచ్ తో పాటు గ్రామస్తులు కోరుతున్నారు

# దళిత స్పీకర్‌ను అవమానించిన బి ఆర్ ఎస్

నెక్కొండలో తాతా మధు దిష్టిబొమ్మ దహనం

స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు - నెక్కొండలో భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు





**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 7:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నెక్కొండలో కాంగ్రెస్ నిరసన చేపట్టింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో, టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో ధర్నా చేసి తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాలయం లాంటి అసెంబ్లీలో దళిత స్పీకర్ ను అవమానించడం దళిత సమాజాన్నే అవమానించడమే అని, బి ఆర్ ఎస్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, నాయకులు బక్కి అశోక్, ఇదునూరి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై దాడి హేయమైన చర్య

సీఎం రేవంత్ రెడ్డి మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలి..

హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్..



**మహేశ్వరం, సెప్టెంబర్ 7, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అసెంబ్లీ సాక్షిగా నిరసనకు దిగితే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పోలీసు బలగాలతో ఒక మహిళ మాజీ మంత్రి, ఎమ్మెల్యే అని చూడకుండా విచక్షణ రహితంగా దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడుతున్నాయని ఆయన అన్నారు. అసెంబ్లీ సాక్షిగా జరిగిన సంఘటనకు సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా బాధ్యత వహించి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న పైశాచిక దోరణి పై గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# 22-A భూముల సమస్యపై బి ఆర్ ఎస్ శ్రేణులు అమీన్పూర్‌లో నిరసన



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువ కిషోర్ పటాన్చెరువు నియోజకవర్గం సెప్టెంబర్ 7 :** పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ సర్కిల్ కాంగ్రెస్ ప్రభుత్వం 22-ఎ జాబితాలో చేర్చిన భూములు, ప్లాట్లు, ఇళ్లకు సంబంధించిన సమస్యను వెంటనే పరిష్కరించి, అర్హులైన ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు అమీన్పూర్‌లో భారత రాష్ట్ర సమితి (BRS) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అమీన్పూర్ ఎం ఆర్ ఓ కి మరియు అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కి వినతిపత్రాలు అందజేసి, 22-ఎ జాబితాలో చేర్చిన భూములు, ప్లాట్లు, ఇళ్లకు సంబంధించిన ఆంక్షలను వెంటనే తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించి, 22-ఎ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.

# అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రసన్న

సర్పంచ్ పిట్టల రవికుమార్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్య పల్లె గ్రామంలో అంగన్వాడి సెంటర్ లో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పిట్టల రవికుమార్ చేతుల మీదుగా చిన్న పిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించారు అలాగే ఎగ్స్ ఫుడ్ పంపిణీ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నపిల్లలకు పౌష్టికమైన అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అమూల్య అంగన్వాడీ టీచర్ మౌనిక పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ నెనావత్ రవి నాయక్..



**మహేశ్వరం, సెప్టెంబర్ 7, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమ్మ తండా సర్పంచ్ నెనావాత్ రవి నాయక్ తెలిపారు. సోమవారం పెద్దమ్మ తండా గ్రామపంచాయతీ వద్ద అర్హులైన వారికి రేషన్ (స్మార్ట్), కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవి నాయక్ మాట్లాడుతూ.. అర్హులైన వారు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. రేషన్ కార్డుల ద్వారా నిత్యవసర సరుకులు అందడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామంలో 60 మందికి రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణా నాయక్, సెక్రెటరీ మల్లేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ మణిరత్నం అవార్డు అందుకున్న భీష్మచారి



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల సెప్టెంబర్ 7 గత 18 సంవత్సరాలుగా సదాశయ ఫౌండేషన్ నిర్వహిస్తున్న డాక్టర్ మెరుగు భీష్మ చారి నేత్ర అవయవ శరీర దాన కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తు, ఓదెల మండలంలో 280 వరకు నేత్ర అవయవ శరీర దానాలను చేయించడం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు తదితర అనేక సమాజ హిత కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తుండడం గుర్తించి,నేతన్న ౧౦ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 6 ఆదివారం రోజున హన్మకొండలో కొండా లక్ష్మణ్ బాపూజీ మణిరత్న అవార్డుతో భీష్మచారిని ముఖ్య అతిథి గౌరవ గుండు సుధారాణి (కుడా చైర్మన్) గూడూరు శ్రీనివాస్ కార్పొరేషన్ చైర్మన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారుఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తు డాక్టర్ భీష్మాచారికి ఓదెల సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్,సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ , పాల్గొన్న ఓదెల ప్రతినిధులు క్యాతం మల్లేశం , వెంకటేశ్వర్లు,సంతోష్, అల్లం సతీష్ , నవీన్, అభినందనలు తెలిపారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి

**తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలి**

**ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించేలా మాట్లాడటం తాతా మధుకు తగదు**

**మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్**



**మణుగూరు, సెప్టెంబర్ 7: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గౌరవనీయులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను నిరసిస్తూ మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధమైన పదవి అని అన్నారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా దూషణలు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం అహంకారానికి పరాకాష్ట అని, ప్రజాస్వామ్య సంప్రదాయాలను అవమానించడమేనని మండిపడ్డారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై అసెంబ్లీలో చర్చకు రావాలని పిలుపునిస్తే చర్చకు రాకుండా, దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడం, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా మాట్లాడటం అత్యంత సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి.. లేదంటే బర్తరఫ్ చేయాలి ప్రజాప్రతినిధిగా ఉండి రాజ్యాంగబద్ధ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధు నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ పదవిని అవమానించే విధంగా మాట్లాడిన వ్యక్తి ప్రజాప్రతినిధిగా కొనసాగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. తాతా మధుపై శాసనసభ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాతా మధు తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని,స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ కి, తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించుకోవాలని, అయితే రాజ్యాంగ సంస్థలు, రాజ్యాంగబద్ధ పదవులను అవమానించేలా మాట్లాడటాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమూరి రాజు, సర్పంచులు పాల్వంచ రాములు, మడకం కృష్ణ, ఉపసర్పంచులు గాండ్ల సురేష్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు పొడుతూరి రవి, ముఖ్య నాయకులు గణేష్ రెడ్డి, జీవి, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, 14 టైర్ యూనియన్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, 12 టైర్ యూనియన్ నాయకులు సురేందర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం సెప్టెంబర్ 7 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి :** ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదిక అని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి, స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాలకు చెందిన బానోతు భవిత గత ఆరు సంవత్సరాలుగా పర్ణశాలలోని నార చీరల వద్ద కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మణుగూరు మండలం సమితిసింగారం గ్రామపంచాయతీకి చెందిన గుండి సౌజన్య అంగన్వాడీ టీచర్ పోస్టుకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని అర్హత సాధించానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు అర్హతలను పరిశీలించి అంగన్వాడీ టీచర్ పోస్టు కేటాయించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి నెల 1,000 ప్యాకెట్ల రక్తం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి



మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు థలసేమియా వెల్ఫేర్ సొసైటీ వినతి.

**పోరు తెలంగాణ,మంచిర్యాల, సెప్టెంబర్ 7 :** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలో రక్త నిల్వల కొరతను నివారించి, ప్రతి నెల అవసరమైన రక్తం అందుబాటులో ఉండేలా సమగ్ర రక్తదాన ప్రణాళిక రూపొందించాలని కోరుతూ థలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చంద్రయ్య కి వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల నిరంతరం రక్త మార్పిడి అవసరమయ్యే థలసేమియా, సికిల్ సెల్ చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (++ం)లో చికిత్స పొందుతున్న అవసరమైన రోగులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, కిడ్నీ డయాలసిస్ రోగులు, రక్తహీనతతో బాధపడుతున్న వారు, అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన రోగులు, రోడ్డు ప్రమాద బాధితులు తదితరులకు రక్తం అత్యవసరంగా అవసరమవుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రతి నెల కనీసం 1,000 మంది రక్తదానం చేసే విధంగా "వన్ ఇయర్ బ్లడ్ డొనేషన్ క్యాలెండర్" రూపొందించాలని కోరారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ, సింగరేణి, విద్యాశాఖ, ఆబ్కారీ శాఖ, అటవీ శాఖ, మెడికల్ కాలేజీ, కళాశాల విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు తదితర శాఖలు, సంస్థలతో సమన్వయం చేసి నెలవారీ రక్తదాన శిబిరాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, ముందుగానే నెలవారీ రక్తదాన శిబిరాల తేదీలను నిర్ణయిస్తే రక్త నిల్వల కొరతను నివారించవచ్చని సొసైటీ ప్రతినిధులు సూచించారు. వినతిపత్రంపై జాయింట్ కలెక్టర్ చంద్రయ్య సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులకు లేఖలు రాసి రక్తదాన శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని, వన్ ఇయర్ బ్లడ్ డొనేషన్ క్యాలెండర్ రూపొందించేందుకు కృషి చేస్తామని, అవసరమైన ప్రతి రోగికి రక్తం అందుబాటులో ఉండేలా సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. వీఈ కార్యక్రమంలో థలసేమియా వెల్ఫేర్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చుంచు శంకర్ వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొజ్జా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలు, మోసాలతో చెలరేగుతున్న ఫరీద్‌పేట్ సర్పంచ్ జీడిపల్లి

# నర్సింహ రెడ్డి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రైతుల తిరుగుబాటు!

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి':సెప్టెంబర్ 07(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామంలో ప్రజాప్రతినిధి ముసుగులో సాగుతున్న అరాచకాలు, అక్రమాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి. గ్రామానికి చెందిన ప్రస్తుత సర్పంచ్, గతంలో మాచారెడ్డి వైస్ ఎంపీపీగా వ్యవహరించిన జీడిపల్లి నరసింహారెడ్డి పాల్పడుతున్న మోసాలపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నాడు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మీడియా ముందు తమ గోడు వెళ్లబోసుకున్న రైతులు, సర్పంచ్ నిరంకుశ పోకడలపై తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. సర్వే నంబర్ 885లో రైతు పల్లె స్వామి గౌడ్ ఎంతో కష్టపడి కొనుగోలు చేసుకున్న పట్టా భూమికి, ఆన్‌లైన్ రికార్డులు రాకుండా నరసింహారెడ్డి కుట్ర పన్నాడని బాధితులు ఆరోపించారు. దీనివల్ల సదరు రైతుకు రావాల్సిన పాస్‌బుక్, రైతుబంధు పథకం అందని ద్రాక్షలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సర్వే నంబర్ 884లో తనకు నచ్చిన వ్యక్తులకు అక్రమంగా పట్టా పాస్‌బుక్‌లు ఇప్పించి వారికి మాత్రం ప్రభుత్వ సాయం అందేలా సర్పంచ్ చక్రం తిప్పాడని రైతులు మండిపడ్డారు. కేవలం సాధారణ భూములనే కాకుండా, మాజీ వైస్ ఎంపీపీ హోదాను



అడ్డంపెట్టుకుని సర్వే నంబర్ 888లోని ఎస్సీ రిజర్వేషన్ భూమిని సైతం సర్పంచ్ నరసింహారెడ్డి తన పేరున అక్రమంగా పట్టా చేసుకుని పదును చేసుకున్నాడని రైతులు బహిరంగంగానే నిలదీశారు. తమకు జరిగిన మోసంపై నిలదీస్తే "తానేం చేయాలని" ఎదురుదాడి చేస్తూ, మోసపూరిత మాటలతో కాలక్షేపం చేస్తున్నాడని పల్లె స్వామి గౌడ్, గుంటి మైసయ్య తదితరులు వాపోయారు. "నన్ను ఎవరూ ఏమీ చేయలేరు, అంతా నా ఇష్టానుసారమే జరుగుతుంది" అంటూ గ్రామంలో హుకుం జారీ చేస్తున్నాడని మండిపడ్డారు. నిత్యం ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన సర్పంచే స్వయంగా భూ కబ్జాలకు, అక్రమాలకు పాల్పడుతుండటంతో ఫరీద్‌పేట్ రైతాంగం తీవ్ర భయాందోళనలో ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి, సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలనిబాధితులకు తక్షణమే న్యాయం చేసి పాస్‌బుక్‌లు, రైతుబంధు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు స్పందించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# గణేష్ మండప నిర్వాహకులతో సమన్వయ సమావేశం





**జిల్లాలో ప్రతి చోట శాంతియుతంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు జరగాలి**

**జిల్లా ఎస్పీ నితికాపంత్.....**

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండప నిర్వాహకులతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మండప నిర్వాహకులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా డీజే, సౌండ్ సిస్టమ్ వినియోగించాలని, ప్రతి మండపం వద్ద 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండప నిర్మాణంలో నాణ్యమైన వస్తువులు, నాణ్యమైన వైర్లు, విద్యుత్ పరికరాలు మాత్రమే వినియోగించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్, సౌండ్ సిస్టమ్, డీజేలు వినియోగించరాదని, మండపాల వద్ద టపాసులు, జూదం, లక్కీ డ్రాలు, బలవంతపు చందాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వరాదని స్పష్టం చేశారు. మద్యం సేవించి మండపాల వద్దకు రావొద్దని, అగ్ని ప్రమాదాల నివారణకు నీరు, ఇసుక వంటి భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం కనిపిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాలను ప్రశాంతంగా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## మహేశ్వరం లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం..



**మహేశ్వరం, సెప్టెంబర్ 7, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఇతర ఎమ్మెల్యేలకు అసెంబ్లీ సాక్షిగా జరిగిన అవమానానికి నిరసనగా మహేశ్వరం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను బీఆర్ఎస్ పార్టీ నాయకులు దగ్ధం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ నిరసన తెలిపేందుకు వెళ్లిన ఎమ్మెల్యేలపై దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ మహేశ్వరం మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వం పై మండి పడ్డారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన తీరుపై సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్‌అలీ, పిఎసిఎస్ డైరెక్టర్లు కాడమోని ప్రభాకర్, పోల్కం బాలయ్య, వార్డు సభ్యులు వీరి బాబు, శ్రీశైలం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిద్దింటి సిద్ధార్థ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల మహేందర్ ముదిరాజ్, యాదగిరి, సంజయ్, మహేష్, నరేందర్, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

# భారతి నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్.



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువ కిషోర్ పటాన్చెరు నియోజకవర్గం సెప్టెంబర్ 7 :** పటాన్చెరు నియోజకవర్గం రామచంద్రపురం పరిధిలోని భారతి నగర్ డివిజన్లో, బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీ గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో మన భారతీనగర్ డివిజన్ ఇంకా బలపడాలి అని కోరుకుంటూ, విద్యుత్ నగర్, భారతీయ నగర్ లో కలిసిన సందర్భంగా ఇక్కడ కూడా భారతీయ నగర్ క్యాడర్ పెరగాలి, అనే ఉద్దేశంలో విద్యుత్ నగర్ భారతి నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్ ని నియమించినారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు రజనీశరత్ , ప్రధాన కార్యదర్శి నారాయణ , సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ కృష్ణమూర్తి , మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా , ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి , శరత్ బాబు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



**పోరుతెలంగాణ సెప్టెంబరు 07: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారికి అవసరమైన సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని చైతన్య వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం కాగజ్నగర్ మండల తహసిల్దార్ మధుకర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు .ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. వికలాంగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, ఇతర సౌకర్యాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వికలాంగులకు అవసరమైన ధ్రువపత్రాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# స్వామి వారి సన్నిధిలో లక్షబిల్వార్చన





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రావణమాసం పురస్కరించుకొని ఆఖరి సోమవారం స్వామివారి సన్నిధానంలో లోక కళ్యాణార్థమై ఉదయం 10 గంటల నుండి సామూహిక లక్ష బిల్వార్చన ఆలయ అర్చకులు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాసిల్దార్ వనజ నాయక్ పాల్గొన్నారు కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ధూపం వీరభద్రయ్య వారి చే గణపతి పూజ పుణ్యవచనం అమ్మవారికి సహస్ర కుంకుమార్చన రుద్ర హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో 180 జంటలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనీ స్వామివారిని దర్శించుకున్నారు కార్యక్రమానంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, మహదేవుని భూమయ్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించిన బి ఆర్ ఎస్ నాయకులు



**పోరు తెలంగాణ, మంచిర్యాల సెప్టెంబర్ :** బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బాల్క సుమన్ ఆదేశాల అనుసారం భీమారం మండల కేంద్రం లో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీవో సతీష్ రెడ్డి కి బిఆర్ఎస్ నాయకుడు కలగూర రాజ్ కుమార్ వినతి పత్రం సమర్పించాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరచాల్సిన ఆరు గ్యారంటీలతో పాటు చెన్నూర్ శాసనసభ్యులు కార్మిక శాఖ మంత్రి వివేక్ చెన్నూర్ యువతకు హామీ ఇచ్చిన 45000 ఉద్యోగాలుకూడ ఇవ్వాలని డిమాండ్ చేశాడు

# స్పీకర్ పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం: ఎమ్మెల్యే పాయం

ఎశ్రీశీఎ:ష్ట్ జూం://షవఎ.షష్టఫ్ -ంఖజూజూ.షశీఎ/67ఙు63టం-0501-48వట-9ఎ01-షౖ115712ఎ8ఎ34పినపాక. , సెప్టెంబర్ 7: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, దళిత నాయకుడు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ ని ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ఒక ఎమ్మెల్సీగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి అసెంబ్లీ ప్రాంగణం వద్ద పోలీసులను దూషిస్తూ, స్పీకర్ ని కించపరిచే విధంగా అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ ని అవమానించేలా మాట్లాడటం అత్యంత బాధాకరమని, ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో తీవ్ర ఆవేదనకు



కారణమవుతున్నాయని పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా రాజ్యాంగ సంస్థలను, వాటి పదవులను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ స్పందించి, స్పీకర్ కి మరియు దళిత సమాజానికి జరిగిన అవమానంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని పాయం వెంకటేశ్వర్లు అన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలానికి తావు ఇవ్వకూడదని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హితవు పలికారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు 'విద్య ప్లస్



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన 'విద్య ప్లస్' పైలట్ ప్రాజెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ వెల్లడించారు. ఎస్ఐఆర్ 2026లో భాగంగా జిల్లాకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు యోగితా రాణాకు 'విద్య ప్లస్'పై వివరణాత్మక సమీక్షా నివేదికను సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికత ఆధారిత, ప్రామాణికమైన, రియల్ టైమ్ పర్యవేక్షణతో కూడిన బోధనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని అదనపు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని గుర్తించి బోధనా విధానాల్లో అవసరమైన మార్పులు తీసుకురావడం ద్వారా మెరుగైన విద్యా ఫలితాలు సాధించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. డిజిటల్ పరికరాలు అందుబాటులో లేని విద్యార్థుల కోసం ప్రింటెడ్ క్యూ.ఆర్./ఆర్‌కో కార్డుల ద్వారా మూల్యాంకనం నిర్వహిస్తారు. విద్యార్థులు ప్రశ్నలకు ఎ, బి, సి, డి సమాధాన కార్డులు ప్రదర్శించగా ఉపాధ్యాయులు వెబ్‌కామ్ ద్వారా స్కాన్ చేసి ఫలితాలను తక్షణమే నమోదు చేస్తారు. తరగతి గదుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధనా సహాయక వ్యవస్థ ద్వారా పాఠ్యాంశాల సారాంశం, విద్యార్థుల సందేహాల నివృత్తి, వీడియోలు, సిమ్యులేషన్లు అందుబాటులోకి తెచ్చి ఆసక్తి, అవగాహన పెంపొందిస్తారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే విధమైన అధ్యయన ప్రణాళిక అమలు చేయడం ద్వారా విద్యార్థుల మధ్య అభ్యసన అంతరాలను తగ్గించి సమాన విద్యా అవకాశాలు కల్పిస్తారు. రోజువారీ బోధనా కార్యక్రమాలు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయి, ప్రతిభ తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక రియల్ టైమ్ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల అకాడమిక్ ప్రతిభను పెంపొందించేందుకు 'విద్య ప్లస్' పైలట్ ప్రాజెక్ట్ కీలకంగా దోహదపడుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

# హియరింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

## పరిశీలకురాలు యోగితా రాణా.....

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రత్యేక ఓటరు సవరణ పరిశీలకురాలు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్మ చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు జాబితా నుంచి తొలగకుండా, అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా



నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు సహకారం అందించాలని పరిశీలకురాలు కోరారు. హియరింగ్ ప్రక్రియలో నోటీసులు అందుకున్నవారు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలలో ఒకటి సమర్పించాలని, వృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్నవారి ధ్రువపత్రాలను కుటుంబ సభ్యులు సమర్పించవచ్చని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆమోదించిన 11 రకాల ధ్రువపత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించి, బూత్ స్థాయి ఏజెంట్లను హియరింగ్ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. హియరింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా చేపడుతున్నామని, నోటీసుల జారీని వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. హియరింగ్ ప్రదేశం, తేదీని బూత్ స్థాయి అధికారుల ద్వారా ముందుగానే తెలియజేస్తున్నామని, గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రచారం చేస్తున్నామని, అర్హుల పేరు ఒక్కటి కూడా తొలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

# తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 82 నూతన కార్యవర్గం ఎన్నిక



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి : సెప్టెంబర్ 7 (పోరు తెలంగాణ న్యూస్:) :** తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 82 ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం కామారెడ్డి డివిజన్ ఎల్లారెడ్డి డివిజన్ బాన్సువాడ డివిజన్ మరియు కామారెడ్డి జిల్లా బాడి ని ఎన్నుకోవడం జరిగింది. స్టేట్ సెక్రటరీ సాయిల్ అన్న మరియు శ్రీకాంత్ మరియు జాషువా ఆధ్వర్యంలో సోమవారం రోజున కామారెడ్డి డివిజన్ అధ్యక్షులుగా రంజిత్ యాదవ్. సెక్రెటరీగా మేకల రాజు . వర్కింగ్ ప్రెసిడెంట్ గా సముద్రాలు రాజు ఎన్నుకోవడం జరిగింది జిల్లా అధ్యక్షులుగా హరికృష్ణ సెక్రెటరీగా కిష్ట గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అదేవిధంగా ఎస్సీ దగ్గరికి పోయి ఆర్టిజన్ సమస్యలు వివరించడం జరిగింది ఎస్సీ సానుకూలంగా స్పందించడం జరిగింది.టీవీ ఈ యు హెచ్ - 82 యూనియన్ లికామారెడ్డి డివిజన్ నూతన కార్యవర్గ సభ్యులు..

డివిజన్ అధ్యక్షుడు
రంజిత్ యాదవ్
డివిజన్ కార్యదర్శి
ఎం. రాజు
వైస్ ప్రెసిడెంట్ లు
ఏ రంజిత్ గౌడ్
యు. బాలరాజు
వర్కింగ్ ప్రెసిడెంట్
సముద్రాల రాజు
క్యాసియర్
జె మహేష్
ఆర్గనైజింగ్ కార్యదర్శి
మనేకర్ రాజు
బి సంతోష్ రెడ్డి
జి రాంబాబు
జాయింట్ కార్యదర్శి



ఎం భాను చరణ్
ఎం వెంకటేశ్వర్లు
బి శ్రీకాంత్
బతులా సురేష్
ఎగ్జిక్యూటివ్ మెంబెర్
కే నరసింహా రెడ్డి
ఎండీ వహీద్
బి. సత్యయ దబ్బ్యా ఎం తదితరులు ఎన్నికైనారు.

# ప్రజావాణి దరఖాస్తుల త్వరిత పరిష్కారానికి ఆదేశం



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జైనూర్ మండలం ఊషేగం గ్రామానికి చెందిన జయ కళాబాయి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, కాగజ్‌నగర్ మండలం కోయవాగుకు చెందిన కాంపెల్లి అరుణ ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన జూపాక పోచం తన పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, చింతలమానేపల్లి మండలం బూరేపల్లికి చెందిన జాడి భగవాన్ తప్పుగా నమోదైన పట్టా భూమిని తన పేరిట సవరించి పాసు పుస్తకం ఇప్పించాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్‌కు చెందిన నగోషా యమునబాయి వితంతు పింఛన్ కోసం, రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్‌కు చెందిన గుండేటి స్వరూప, జైనూర్ మండలం ఊషేగాంకు చెందిన కోవ కమలాబాయి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించే చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# రైలులో నిషేధిత గడ్డి మందు స్వాధీనం

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం



భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న రామగిరి ఎక్స్‌ప్రెస్ (17004)లో అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును కాగజ్‌నగర్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ముందస్తు సమాచారం మేరకు ప్లాట్‌ఫామ్ నంబర్-2 వద్ద ఆర్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మొత్తం 81 గడ్డి మందు ప్యాకెట్లు, 5 లీటర్ల సామర్థ్యం కలిగిన ఐదు క్యాన్లు, 1 లీటర్ సామర్థ్యం కలిగిన ఐదు క్యాన్లు లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న మందును కాగజ్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ప్రాచీ దేవి, ఏఎస్ఐ ఆర్. దాసు, సిబ్బంది కమలేష్ కుమార్ సింగ్, ప్రేమానంద్, రైల్వే స్టేషన్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ మీణా తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు శోచనీయం



**జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్. కామారెడ్డి బీబీపేట్, ఆగస్టు 07(పోరు తెలంగాణ న్యూస్:) ద:** దళిత స్పీకర్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు శోచనీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ**

సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమన్నారు శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సరికాదని అన్నారు.బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ తాత మధు తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి, శాసన మండలి నిబంధనల ప్రకారం తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని ఆయన స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అవమానాలు, కుల వివక్షకు తావులేదన్నారు. ఇటువంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించదన్నారు ఇకనైనా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు తక్షణమే దళిత స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎస్‌పీఎం సీఎస్ఆర్‌తో నైపుణ్య శిక్షణలకు ప్రోత్సాహం

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి**





: కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ (ఎస్పీఎం) సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా టైలరింగ్, కంప్యూటర్, డిటర్జెంట్ పౌడర్ తయారీ శిక్షణలను పూర్తి చేసిన 254 మందికి సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎస్‌పీఎం జనరల్ మేనేజర్లు (హెచ్ఆర్ ు ఐఆర్) గిరి, (సివిల్ ు ఇన్‌స్ట్రుమెంటేషన్) గిరీష్ రాయ్ శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని వాటిని స్వయం ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు. ఆర్థిక స్వావలంబన కోసం ఎస్‌పీఎం సీఎస్ఆర్ నిరంతరం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. 2023 నుంచి టైలరింగ్ ద్వారా 721 మందికి పైగా, ఉచిత కంప్యూటర్ శిక్షణ ద్వారా 733 మందికి శిక్షణ అందించారు. అలాగే మష్రూమ్ కల్టివేషన్, జూట్ బ్యాగ్స్, స్క్రీన్ ప్రింటింగ్, డోర్ మ్యాట్స్, మగం వర్క్, డిటర్జెంట్ పౌడర్ తయారీ వంటి పలు రంగాల్లో మహిళలకు శిక్షణలు అందిస్తూ స్వయం ఉపాధికి ఎస్‌పీఎం సీఎస్ఆర్ చేయూతనిస్తోంది.




# ఈవీఎం గోదాము వద్ద నిరంతర పటిష్ట భద్రతకు చర్యలు



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతర పటిష్ట భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి, గోదాములో ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన బాక్సులను పరిశీలించారు. ఈవీఎం గోదాము వద్ద నిరంతర పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు, సీసీ కెమెరాల ద్వారా ఎల్లవేళలా పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బోనస్ ప్రకటించిన సన్న రకం వరి విత్తనాల నమోదు చివరి సెప్టెంబర్ 10

## మండల వ్యవసాయ అధికారి భాస్కర్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ప్రభుత్వం సిఫారసు చేసిన వరి సన్న రకాలు బి పి టి-5204 కె కె ఎన్ ఎం - 1638, కె ఎన్ ఎం -7715, జై శ్రీరామ్‌హెచ్ ఎం టి డబ్ల్యూ జి ఎల్‌ఔ+గా-44 పి ఎన్ ఆర్-15048 డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు మీరు విత్తనాలు కొనుగోలు చేసిన గుర్తింపు పొందిన విత్తన డీలర్ వద్దే తప్పకుండా విత్తనాలు కొనుగోలు చేసినవివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి సొంత విత్తనాలతో సాగు చేస్తున్న రైతులు , ఇతర రైతుల నుంచి విత్తనాలు పొందినా, లేదా వ్యవసాయ పరిశోధనా కేంద్రం / అనుమతించబడిన ఇతర వనరుల నుంచి విత్తనాలు పొందినా,

మీ వ్యవసాయ విస్తరణ అధికారి ఏ ఈ ఓ వద్ద రైతు ధృవీకరణ పత్రం సమర్పించాలి.
అనంతరం ఏ ఈ ఓ ద్వారా మీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి.
ముఖ్యమైన చివరి తేదీ :10-09-2026
కావాల్సిన పత్రాలు
1.రైతు ధృవీకరణ పత్రం
2.రైతు ఆధార్ కార్డ్
3.రైతు పట్టా పాస్ బుక్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలి

# డీజే నిర్వాహకుల బైండోవర్



**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 7 :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్షెట్టిపేటకు చెందిన పలువురు డిజే నిర్వాహకులను తాసిల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగింది. గణేష్ నవరాత్రుల సందర్భంగా వినాయక మండపాల వద్ద ఎలాంటి డీజేలకు అనుమతి లేదని శోభాయాత్రలో కూడా డీజేలు పెట్టకూడదని భక్తి శ్రద్ధలతో శాంతియుత వాతావరణం లో గణేష్ పండుగను జరుపుకోవాలని పోలీసులు సూచించారు. గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ పోర్టల్ లో పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. మండపాల వద్ద సినిమా పాటలు పెట్టడం, జూదం ఆడటం లాంటివి చేయకూడదని ముఖ్యంగా భారీ సౌండ్ వచ్చే బాక్స్ ఎట్టి పరిస్థితుల్లో పెట్టకూడదని పోలీసులు సూచించారు. డీజే నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి డీజేలు పెట్టిన శోభాయాత్రలు డీజెలు పెట్టిన శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని లక్షట్ పేట గోపతి సురేష్ తెలిపాడు.

# ప్రక్కాగా డిజిటల్ క్రాప్ సర్వే



### క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

**పోరు తెలంగాణ,లక్షెట్టి పేట,సెప్టెంబర్ 07 :** లక్షెట్టిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే కొనసాగుతోంది.ఏ.ఈ.ఓ,వాలంటీర్ల ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేస్తున్నారు.రైతులు వేసిన పంట వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా వాలంటీర్ లు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తూ పంటల ఫోటోలను,వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నారు.ఈ సీజన్ లో రైతులు ఏ పంట సాగు చేశారు,ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు,తదితర వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేస్తున్నారు.దీంతో అధికారులు డిజిటల్ క్రాప్ సర్వే కి ప్రాధాన్యత ఇస్తున్నారు.

# టీజీఈ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలి



**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 7 :** తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తేదీ 10.09.2026 గురువారం రోజున ఛలో హైదరాబాద్ కార్యక్రమం ను విజయవంతం చేయడానికి టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి , సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యం లో ఐ డి ఓ సి నస్పూర్ మంచిర్యాలలో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించి చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగినది. టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర టీజీఈ జేఏసీ సెప్టెంబర్ 10వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం ను విజయవంతం చేయడానికి మంచిర్యాల జిల్లా నుంచి 5 వేల ఉద్యోగులు తక్కువ కాకుండా చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ ఉపాధ్యాయుల కార్మికుల పెన్షన్ సమస్యలను పరిష్కారం కొరకు మంచిర్యాల నుంచి పెద్ద ఎత్తున హాజరుకావాలని తెలపడం జరిగినది. తదుపరి చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ ను ఆవిష్కరణ చేయడం జరిగినది. సెక్రెటరీ జనరల్ వనజా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల కార్మిక పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావడానికి మంచిర్యాల జిల్లాలోని ప్రతి ఒక్క ఉద్యోగి చల్లా హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగుల సమస్యలపై పోరాడాలని తెలపడం జరిగినది. ఈ సన్నాహక సమావేశంలో మంచిర్యాల జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్ కార్యదర్శి డిఆర్డిఓ కిషన్ సీఈఓ గణపతి మతి రాజేశ్వరి కో-చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీ పతి బాపురావు డిప్యూటీ సెక్రటరీ జనరల్ అత్తే సుధాకర్ , బొడ్డు శ్రావణ్ తంగళ్ళపల్లి తిరుపతి, సత్యనారాయణ, ప్రభు మరియు టీజీవో,టీఎన్జీఓ, నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల మరియు కార్మిక సంఘాల ప్రతినిధులు నాయకులు మరియు జిల్లా లోని అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 7, 2026 :** వానాకాలం 2026-27 సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కొరకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి జిల్లా గిరిజన అభివృద్ధి సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మెప్మా, డి సి ఎం ఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026- 27 కు సంబంధించి జిల్లాలో అవసరమైన గోదాములను గుర్తించి సిద్ధం చేయాలని, సంబంధిత ఏజెన్సీ లతో సన్నాహక సమావేశాలు నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎత్తైన ప్రదేశాలలో చదునుగా ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేసేలా చూడాలని, జిల్లాలో అక్టోబర్ 1వ తేదీ నాటికి సంబంధిత ఏజెన్సీలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు సమకూర్చుకొని సిద్ధంగా ఉండాలని, అక్టోబర్ 1వ తేదీలోగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పి సి ఎస్ ఎ పి అప్లికేషన్ లో 16 ప్రశ్నలకు రియల్ టైం ఫొటోస్ నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల రీ కన్ఫేషన్ త్వరితగతిన పూర్తి చేయించాలని, వానాకాలం సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆన్ లైన్ ప్రకారం ట్రక్ షీట్స్ జనరేషన్, గోనె సంచుల నిర్వహణ, లారీలకు జియో టాగింగ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టేలా అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**పోరు తెలంగాణ, మంచిర్యాల,సెప్టెంబర్ 7, 2026:** ఎస్ఐఆర్ లో భాగంగా నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు , ఎ.ఈ.ఆర్.ఓ లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా నో మ్యాపింగ్, అనామోలీస్ జాబితాకు సంబంధించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, నోటీసుల జారీ అనంతరం భారత ఎన్నికల సంఘం ద్వారా పేర్కొనబడిన డాక్యుమెంట్ల ద్వారా పరిశీలన చేసి ప్రక్రియని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత ఈ.ఆర్.ఓ. లు కార్యాచరణ ప్రకారం హియరింగ్ ఏర్పాటుచేసి సరైన డాక్యుమెంట్లను మాత్రమే పోర్టల్ లో నమోదు చేసేలా కృషి చేయాలని, జిల్లా ఎన్నికల అధికారులు తమ లాగిన్ లో త్వరగా క్లియర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ సంబంధిత హెల్ప్ డెస్క్ లను జిల్లా స్థాయిలో, ఈ.ఆర్.ఓ. కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని, బూత్ స్థాయి అధికారులు నోటీసులు అందించిన వెంటనే సమర్పించవలసిన డాక్యుమెంట్లపై ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 70 శాతం నోటీసులు అందించడం జరిగిందని, మిగిలిన నోటీసులు కూడా త్వరలోనే పూర్తిగా అందిస్తామని తెలిపారు. హియరింగ్ కార్యాచరణ ప్రకారం నిర్వహించడం జరుగుతుందని, ఓటర్లు సరైన డాక్యుమెంట్లు సమర్పించేలా వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పెండింగ్ ఉన్న నో మ్యాపింగ్, అనామోలీస్ సంబంధిత ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి





### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 7, 2026 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి .చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం యాపల్ ప్రాంతానికి చెందిన గాజుల ఈశ్వరి తన భర్త చనిపోయారని, దినసరి కూలీగా పనిచేస్తూ తన పిల్లలను పోషించుకుంటున్నానని నిరుపేద అయిన తనకు రెండు పడక గదుల ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణం తెలంగాణ నగర్ కు చెందిన బి.కస్తూరి తన ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభానికి ఏర్పాటుచేసిన సపోర్టు వైరు ప్రమాదకరంగా ఉందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన గడ్డం ముకుందర్ రెడ్డి తనకు గల వ్యవసాయ భూమిని ఎల్లంపల్లి ప్రాజెక్టులో రికార్డు నుండి తొలగించారని, రైతుబంధు, రుణమాఫీ రాకపోవడంతో నష్టపోతున్నానని, రికార్డులు సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తాను నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం తలమల గ్రామానికి చెందిన పూసం రత్నుబాయి తాను జి.ఎన్.ఎం. పూర్తి చేశానని, చందారం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తల సేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ తమ దరఖాస్తులో ప్రతినెల 1 వేయి యూనిట్ల రక్తం సేకరించే విధంగా జిల్లా స్థాయి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి వార్షిక రక్తదాన క్యాలెండర్ రూపొందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. మందమర్రి మండలం విద్యానగర్ కు చెందిన మాచర్ల చైతన్య తాను విద్యానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆయాగా విధులు నిర్వహిస్తున్నానని, ఆర్డర్ కాపీ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నెక్కొండలో బీఆర్ఎస్ ప్రజావాణి కాంగ్రెస్ 420 హామీల అమలుకు వినతి

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా నెక్కొండలో బైక్ ర్యాలీ




**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ :** 7కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ నెక్కొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. నోడల్ అధికారి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా చెప్పుకోదగ్గ పథకం ఒక్కటీ లేదని విమర్శించారు. హామీలు నమ్మి ప్రజలు మోసపోయారని, నర్సంపేట నియోజకవర్గంలో రైతులు, విద్యార్థులు, మహిళల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్, మిషన్ భగీరథ వంటి పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. హామీలు అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్, కొమ్ము రమేష్ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ ఆశ్రమ పాఠశాల బాలురకు ఏకరూప దుస్తుల పంపిణీ

### గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట.....

### డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ.....





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 07: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు.కాగజ్‌నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురను సందర్శించిన సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, డీఆర్‌డీఏ ఏపీడీ బానోత్ దత్తారంతో కలిసి పాఠశాలలో చదువుతున్న 220 మంది గిరిజన విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ, కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని 46 గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక జత ఏకరూప దుస్తులను అందజేస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 9,200 మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వారి విద్యాభివృద్ధి, ఆరోగ్యం, వసతి, భోజనం, దుస్తులు తదితర అన్ని అవసరాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జాదవ్ అంబాజీ విద్యార్థులకు సూచించారు. ఏకరూప దుస్తులు అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాల లో వైద్య ఆరోగ్య శిబిరం







**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 7** రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాలలో లో ఈరోజు ప్రత్యేక వైద్య మరియు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న విద్యార్థు లందరికీ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి, తగిన మందులను అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డా. రహేలా తన్వీర్ మెడికల్ ఆఫీసర్ డా. సుమన్ నర్సింగ్ ఆఫీసర్ కె. శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ కె. మల్లేష్, ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్తలు నాగమణి, రమ, విజయ, సంపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్ తిరుపతికి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్..!



తిరుపతి నుంచి రైలు అనుసంధానాన్ని విస్తరించి, మెరుగుపరచాలన్న ఎంపీ అభ్యర్థన మేరకు నైరుతి రైల్వే రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ఈ ప్రతిపాదనను చేర్చారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నందుకు రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓకు గురుమూర్తి ధన్యవాదాలు.. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు, కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శాఖ తీపి కబురు అందించింది. కర్ణాటకలోని శివమొగ్గ టౌన్ నుండి బెంగళూరు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి నూతన 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైలును ప్రారంభించాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఓ ఎంపీ అభ్యర్థన మేరకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ ప్రతిపాదనతో ఏపీలో మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుంది. శివమొగ్గ పట్టణం, తిరుపతి మధ్య బెంగళూరు మీదుగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలన్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అభ్యర్థనకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ సర్వీసు కోసం అధికారిక ప్రతిపాదనను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. తిరుపతి నుంచి రైలు అనుసంధానాన్ని విస్తరించి, మెరుగుపరచాలన్న ఎంపీ అభ్యర్థన మేరకు నైరుతి రైల్వే రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ఈ ప్రతిపాదనను చేర్చారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నందుకు రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓకు గురుమూర్తి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మిగిలిన లాంఛనాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి, త్వరలోనే ఈ సేవను ప్రారంభించాలని అధికారులను కోరారు. ప్రతిపాదిత రైలు తిరుపతి, శివమొగ్గ, బెంగళూరు మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని, తద్వారా యాత్రికులకు, అలాగే విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, ఇతర ప్రయోజనాల కోసం ప్రయాణించే ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు. కర్ణాటకలోని శివమొగ్గ, బెంగళూరు పరిసర ప్రాంతాల నుండి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుంది. అలాగే ఉన్నత విద్య, వైద్య సేవలు, ఉద్యోగాలు, వ్యాపార నిమిత్తం బెంగళూరు, తిరుపతి మధ్య ప్రయాణించే వారికి అత్యంత వేగవంతమైన, సుఖవంతమైన రవాణా సౌకర్యం లభిస్తుంది.

## ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులకు కేంద్రం బిగ్ రిలీఫ్ మారిన సిలిండర్ బుకింగ్ నిబంధనలు!



హోర్ముజ్ దిగ్బంధనం, గ్యాస్ కొరత కారణంగా బుకింగ్ నిబంధనలను అమల్లోకి తెచ్చింది కేంద్రం. దీనివల్ల సాధారణ ప్రజలకు గణనీయమైన అసౌకర్యం కలిగింది. అయితే ఇప్పుడు నిబంధనలను మరోసారి సవరించడంతో ఇది సాధారణ ప్రజలకు, ముఖ్యంగా ఇంట్లో ఎక్కువ గ్యాస్ అవసరమయ్యే వారికి ఉపశమనం కలిగిస్తుంది.. ఇటీవల దేశంలో గ్యాస్ కొరత ఏర్పడటంతో మొదటి సిలిండర్ తీసుకున్న 45 రోజుల తర్వాతే రెండో సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఈ నిబంధనను మార్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రాబోయే 25 రోజుల్లోగా గ్యాస్ రీఫిల్‌లకు అనుమతి ఉంటుందని కేంద్ర మంత్రి సురేష్ గోపి తెలిపారు. ఈ కొత్త విధానం సెప్టెంబర్ 7వ తేదీ, సోమవారం నుండి అమలులోకి వచ్చింది. ఇకపై గ్యాస్ సిలిండర్‌ను రీబుక్ చేసుకోవడానికి ఎవరూ 45 రోజులు వేచి ఉండాల్సిన అవసరం లేదు. దానికి బదులుగా వారు కేవలం 25 రోజుల్లోనే రీబుక్ చేసుకోవచ్చు. దీనివల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉంటారు. సెప్టెంబర్ 7వ తేదీన ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో ఈ మార్పులను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను (OMC\T) ఆదేశించిందని పేర్కొన్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంఘర్షణ చమురు కంపెనీలపై గణనీయమైన ఒత్తిడిని తెచ్చిందని, దీని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల అంతరం ఏర్పడిందని కూడా ఆయన తెలిపారు.హోర్ముజ్ దిగ్బంధనం, గ్యాస్ కొరత కారణంగా 45 రోజులలోపు గ్యాస్‌ను తిరిగి బుక్ చేసుకోవాలనే నిబంధనను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనివల్ల సాధారణ ప్రజలకు గణనీయమైన అసౌకర్యం కలిగింది. అయితే ఇప్పుడు నిబంధనలను మరోసారి సవరించడంతో ఇది సాధారణ ప్రజలకు, ముఖ్యంగా ఇంట్లో ఎక్కువ గ్యాస్ అవసరమయ్యే వారికి ఉపశమనం కలిగిస్తుంది.

## నెల రోజుల్లో బంగారం వెండి ధరలు ఎంత పెరిగాయో తెలుసా..?



గత నెలలో బంగారం, వెండి ధరలు ఖచ్చితంగా పెరిగాయి. కానీ భవిష్యత్తులో అవి అస్థిరంగానే ఉండవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లోని మార్పులు, వడ్డీ రేట్లకు సంబంధించిన సంకేతాలు వాటి ధరలను ప్రభావితం చేయగలవు. బంగారం, వెండి ధరలు మరింత తగ్గే.. గత నెల రోజులుగా బంగారం, వెండి కొనుగోలుదారులకు మార్కెట్ చాలా చురుకుగా ఉంది. బంగారం, వెండి ధరలు రెండూ ఒక్కసారిగా పెరిగాయి. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వారి డేటా ప్రకారం, ఆగస్టు 5వ తేదీ నుండి సెప్టెంబర్ 7వ తేదీ మధ్య బంగారం, వెండి ధరలు రెండూ గణనీయంగా పెరిగాయి. ఆగస్టు 5వ తేదీన, 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.1,45,626గా ఉంది. సెప్టెంబర్ 7వ తేదీన, దాని ధర 10 గ్రాములకు రూ.1,53,340కి పెరిగింది. అంటే సుమారు ఒక నెల వ్యవధిలో బంగారం ధర 10 గ్రాములకు రూ.7,714 మేర పెరిగింది. శాతంలో చెప్పాలంటే, ఈ కాలంలో బంగారం ధర సుమారుగా 5.03 శాతం పెరిగింది. బంగారంతో పాటు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. ఆగస్టు 5న కిలో వెండి ధర రూ.224,562గా ఉండగా, సెప్టెంబర్ 7 నాటికి అది కిలోకు రూ.235,456కు పెరిగింది. అంటే, సుమారు ఒక నెల వ్యవధిలో వెండి ధర కిలోకు రూ.10,894 మేర పెరిగింది. ఈ కాలంలో వెండి ధరలు 4.85 శాతం పెరిగాయని ఇది సూచిస్తుంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి





రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా

**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 7, 2026:** జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎ.ఈ.ఆర్.ఓ.లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 లో భాగంగా జిల్లాలో 1 లక్షా 70 వేల మ్యాపింగ్ కాని, అనమోలీస్ ఓటర్ల సంబంధిత నోటీసులు జనరేట్ చేయడం జరిగిందని, జనరేట్ చేసిన 1 లక్షా 10 వేల నోటీసులు పంపిణీ చేసి, మిగిలిన 60 వేల నోటీసులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 3 ఈ.ఆర్.ఓ. లు, 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు, అదనంగా కేటాయించబడిన 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు ఎస్ ఐ ఆర్ సంబంధిత క్లెయిమ్స్ ఢ అబ్జెక్షన్ ప్రక్రియపై పని చేస్తున్నారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, నోటీసులు జారీ అయిన ప్రతి ఒక్కరు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన 11 డాక్యుమెంట్లలో నుంచి మాత్రమే సంబంధిత ఓటర్లు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు నోటీసుల జారీ, సంబంధిత డాక్యుమెంట్ల సమర్పణ తదితర అంశాలపై మరొకసారి శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నో మ్యాపింగ్, అనమోలీస్, ఎ.ఎస్.డి. జాబితాను సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లకు అందించాలని, బూత్ స్థాయి అధికారులు నోటీసులు జారీ అయిన ఓటర్లు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో కలిసి ఎ ఈ ఆర్ ఓ లు, అదనపు ఎ ఈ ఆర్ ఓ లతో ఎస్ ఐ ఆర్- 2026 ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులకు, సూపర్వైజర్ లకు నియమ నిబంధనలపై శిక్షణ నిర్వహించాలని తెలిపారు. నో మ్యాపింగ్, అనమోలీస్, ఎ ఎస్ డి జాబితాను సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని తెలిపారు. ఎస్ ఐ ఆర్ కు ప్రతిరోజు కొంత సమయం ప్రత్యేకంగా కేటాయించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమ్యూనిటీ సర్టిఫికెట్ నిబంధనలను అనుసరించి త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా ను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం నస్పూర్ లో గల 250, 251, 252, 253 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సంబంధిత బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఇల్లు నిర్మించేటప్పుడు పునాది లెవల్ వరకు ఎంత ఖర్చు అవుతుందో తెలుసా?




1200 చదరపు అడుగుల ఇంటి పునాది (బేస్మెంట్) నిర్మాణానికి అయ్యే ఖర్చులను ఈ కథనం వివరిస్తుంది. సిమెంట్, ఇసుక, స్టీల్, ఇటుకలు, కంకర, మేస్త్రీ, కూలీల ఖర్చులను వివరంగా తెలుసుకుందాం.. మొత్తం నిర్మాణానికి సుమారు ఎంత ఖర్చు అవుతుంది..? కొత్త ఇంటి నిర్మాణం చేపట్టేవారికి పునాది (బేస్మెంట్) వేయడానికి అయ్యే ఖర్చుల గురించి పూర్తి అవగాహన అవసరం. ఇందులో 133 గజాలు (సుమారు 1200 చదరపు అడుగులు, 40 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు) ఉన్న ఒక ఇంటి పునాది నిర్మాణానికి అయ్యే వివిధ ఖర్చులను వివరంగా తెలుసుకుందాం. దీనికి సంబంధించిన వివరాలు ఓ ఇంటిని నిర్మించిన యజమాని ద్వారా అందిస్తున్నాము. ఈ పనులు మొత్తం ఆరు రోజుల్లో ఎనిమిది మంది వర్కర్లతో పూర్తి చేయవచ్చంటున్నారు.

**మెటీరియల్ ఖర్చులు:**

1. ఇసుక: పునాది నిర్మాణానికి సుమారు 6 యూనిట్ల ఇసుక అవసరం అవుతుంది. దీనికి అంచనా వ్యయం రూ.12,000.
2. సిమెంట్: సుమారు 100 బస్తాల సిమెంట్ వినియోగించబడింది. ఒక్కో బస్తా రూ.300 చొప్పున మొత్తం రూ.30,000 ఖర్చు అవుతుంది.
3. స్టీల్ / ఐరన్: ఇంటి పునాదికి అత్యంత ముఖ్యమైనది స్టీల్. సుమారు 1.5 టన్నుల స్టీల్ అవసరం. దీనికి దాదాపు రూ.90,000 వరకు ఖర్చు అవుతుంది.
4. ఇటుకలు: బేస్మెంట్ నిర్మాణం, చుట్టూ కాంపౌండ్ వాల్ కోసం సుమారు 8,000 ఇటుకలు అవసరమవుతాయి. ప్రస్తుతం ఒక ఇటుక ధర రూ.7 చొప్పున, ఇటుకలకు మొత్తం రూ.56,000 ఖర్చు అవుతుంది.
5. కంకర: ఈ నిర్మాణానికి 3 యూనిట్ల కంకర వినియోగించబడింది. దీనికి సుమారు రూ.18,000 ఖర్చు అవుతుంది.

**కూలీల ఖర్చులు:**

పునాది నిర్మాణ పనులకు రాడ్ బెండర్లు, మేస్త్రీలు, హెల్పర్లు వంటి వర్కర్లు అవసరం. ఈ ఎనిమిది మంది సభ్యుల బృందం ఆరు రోజులలో పనిని పూర్తి చేసింది. వర్కర్లందరికీ కలిపి అంచనా వ్యయం సుమారు రూ.1,00,000. మేస్త్రీల ఖర్చులు ప్రాంతాన్ని బట్టి, పనితీరును బట్టి మారవచ్చు.

**మొత్తం అంచనా ఖర్చు:**

ఈ అన్ని ఖర్చులను కలుపుకుని, 1200 చదరపు అడుగుల ఇంటి పునాది నిర్మాణానికి అయ్యే అంచనా వ్యయం క్రింది విధంగా ఉంది:
ఇసుక: 12,000
సిమెంట్: రూ.30,000
స్టీల్: రూ.90,000
ఇటుకలు: రూ.56,000
కంకర: రూ.18,000
కూలీలు: రూ.1,00,000
మొత్తం అంచనా వ్యయం: రూ.3,06,000.

ఇది సుమారు రూ.3,00,000 నుండి రూ.3,10,000 వరకు ఉండవచ్చు. అదనంగా, నిర్మాణ సమయంలో యజమానులు అందించే టిఫిన్లు, ఆహారం వంటి అదనపు ఖర్చులు మరో రూ.10,000 నుండి రూ.20,000 వరకు చేరవచ్చు. అందుకే మొత్తం ఖర్చు రూ.3,10,000 నుండి రూ.3,20,000 వరకు కావచ్చని అంచనా.

**ముఖ్య గమనిక:**

నిర్మాణ ఖర్చులు ప్రాంతం, మెటీరియల్ ధరలు, మట్టి పరిస్థితి, ఇంజనీర్ సూచించే ఫౌండేషన్ డిజైన్‌ను బట్టి మారవచ్చు. ఈ వివరాలు ఒక అంచనా మాత్రమే,ఇది మీకు ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది.

## బ్రతికుండగానే పిల్లలకు ఆస్తులు రాసిస్తున్నారా..? ఇలా చేస్తే ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ ఉండదు



ఆస్తుల పంపకాల్లో తరచుగా అన్నాతమ్ముళు,, అన్నాచెల్లెళ్లు మధ్య తరచుగా వివాదాలు జరుగుతూ ఉంటాయి. దీనికి కారణం తల్లిదండ్రులు బ్రతికుండగానే ఆస్తులు పంపిణీ చేయకపోవడం. ఇలాంటి వివాదాలు రాకుండా ఉండేందుకు కొంతమంది ముందుగానే ఆస్తులను పంపకాలు చేస్తూ ఉంటారు. రెండు మార్గాల్లో పంపకాలు చేయవచ్చు. కొంతమంది బ్రతికుండగానే తమ వారసులకు ఆస్తులు రాసిస్తూ ఉంటారు. తాము మరణించాక వివాదాలు రాకూడనే ఉద్దేశంతో ముందుగానే ఆస్తులు పంపిణీ చేస్తూ ఉంటారు. ఆస్తులు తమ వారసులకు బదిలీ చేయడానికి తల్లిదండ్రులకు రెండు మార్గాలు ఉంటాయి. అందులో ఒకటి గిఫ్ట్ డీడ్ ద్వారా అప్పగించడం లేదా వీలునామా ద్వారా రాసివ్వడం. గిఫ్ట్ డీడ్ ద్వారా ఎప్పుడు కావాలంటే అప్పుడు అప్పగించవచ్చు. అదే వీలునామా ద్వారా అయితే మరణాంతరం వారసులకు దక్కుతుంది. అయితే ఈ రెండిటిల్లో ఏది మంచిది? అనే అంశం ఇప్పుడు చూద్దాం.

గిఫ్ట్ డీడ్ వల్ల బెనిఫిట్స్ ఇవే..

భారత చట్టాల ప్రకారం కుటుంబసభ్యులు, దగ్గరి బంధువులకు గిఫ్ట్ డీడ్ రూపంలో ఆస్తులు ఇవ్వవచ్చు. బహుమతిగా ఇచ్చే వస్తువులపై ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ ప్రకారం ఎలాంటి పన్ను అప్పగించాల్సిన అవసరం లేదు. అయితే ఇది కేవలం కుటుంబసభ్యులు లేదా బాగా దగ్గరి బంధువులకు మాత్రమే వర్తిస్తుంది. ఇతరులకు ఇవ్వడానికి కుదరదు. ఇతరులకు ఇవ్వాలంటే పన్ను పరిధిలోకి వస్తాయి. అయితే గిఫ్ట్ డీడ్ ద్వారా ఇస్తే పన్ను ఉండదు కానీ.. స్టాంప్ డ్యూటీ మాత్రం వర్తిస్తుంది. అయితే వీలునామా ద్వారా వచ్చే ఆస్తులపై ట్యాక్స్, స్టాంప్ డ్యూటీ రెండూ ఉండవు. వీలునామా ద్వారా వచ్చే ఆస్తులపై రెండు విధాలుగా బెనిఫిట్ ఉంటుంది. అయితే వీటి ద్వారా వారసులకు వచ్చే ఆదాయంపై మాత్రం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే స్థిరాస్తులు బహుమతిగా అప్పగించాలంటే రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ చేయించుకోవాలి. ఒకసారి గిఫ్ట్ డీడ్ ద్వారా అప్పగిస్తే తల్లిదండ్రులకు ఆ ఆస్తులపై ఎలాంటి హక్కు ఉండదు. కానీ విలునామా ద్వారా అప్పగిస్తే జీవితాంతం నియంత్రణ ఉంటుంది. అయితే షరతులతో కూడిన గిఫ్ట్ డీల్ చేసుకుంటే తల్లిదండ్రుల నియంత్రణ కొనసాగుతోంది. అయితే బహుమతిగా ఇచ్చే నివాస, వ్యవసాయ భూములకు కొన్ని రాష్ట్రాలు రాయితీ స్టాంప్ డ్యూటీలు అందిస్తున్నాయి. ఇక వారసులు విదేశాల్లో ఉంటే విదేశీ మారక నిబంధనలు వర్తిస్తాయి.

ట్యాక్స్ పరిధిలోకి లేవు..

ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ ప్రకారం.. వారసత్వంగా అప్పగించే ఆస్తులపై పన్ను ఉండదు. అలాగే కుటుంబసభ్యులు బహుమతిగా ఇచ్చే ఆస్తులు, వస్తువులు కూడా ట్యాక్స్ పరిధిలోకి రావు. అలాగే పెళ్లికి బంధువుల నుంచి అందుకునే వస్తువులకు కూడా పన్ను ఉండదు. ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ గురించి చాలామందికి అవగాహన లేక వీటి ప్రయోజనాలు అందుకోలేరు.

## సామాన్యులకు బ్యాడ్ న్యూస్ తగ్గని షుగర్ ధరలు ఇప్పుడు కిలో ఎంతంటే..?



దేశంలోని సామాన్యులకు బ్యాడ్ న్యూస్ అందింది. చక్కెర ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇంకా దిగి రావడం లేదు. గత కొద్ది రోజులుగా ధరలు శాంతించకపోవడంతో కొనుగోలుదారులకు నిరాశ ఎదురవుతుంది. కేంద్రం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ.. ధరలు పెరుగుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ధరలు ఇలా ఉన్నాయి. సామాన్యులకు బ్యాడ్ న్యూస్. చక్కెర్ ధరలు ఇంకా తగ్గుముఖం పట్టడం లేదు. దేశంలో చక్కెర ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోంది. అయితే ధరలు ఇంకా అదుపులోకి రావడం లేదు. ఇప్పటికీ కిలోకు రూ. 60కిపైగా ధరలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఇదే అదునుగా చేసుకుని.. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో చక్కెరను ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. కిలోకు రూ. 75 వరకు విక్రయిస్తుండటంతో ప్రజలపై భారం పడుతుంది. త్వరలో వినాయక చవితి, దసరా లాంటి పండుగలు వస్తున్నాయి. దీంతో చక్కెర ధరలు పెరగడం సామాన్యులకు నిరాశగా చెప్పవచ్చు.

ధరలు పెరగడానికి కారణాలేంటి..?

చక్కెర్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. జూలైలో కిలో షుగర్ సుమారు రూ.48 వద్ద ఉండగా.. జూలై 20న కిలోకు రూ. 48.18 వద్ద ఉండగా.. ఆగస్టు 20 నాటికి ఏకంగా రూ. 55.70కి చేరుకుంది. కొన్ని మార్కెట్లలో చిల్లర ధరలు కిలోకు రూ. 67 నుంచి రూ. 70 వరకు చేరాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రపంచంలో ప్రధానంగా భారత్ చక్కెరను ఎక్కువగా ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు భారత్ దేశీయ సరఫరాలో కొరత ఎదుర్కొడం చర్చనీయాంశంగా మారింది.

చక్కెర ధరలు ప్రధాన నగరాల్లో ఇలా..

నోయిడాలో కిలో షుగర్ రూ.58 నుంచి రూ.62 మధ్య ఉండగా.. లక్నోలో రూ.50 నుంచి రూ.54, ఢిల్లీలో రూ.55 నుంచి రూ.60, ముంబైలో రూ.60 నుంచి రూ.62, కోల్ కత్తాలో రూ.62 నుంచి రూ.66, హైదరాబాద్‌లో రూ.55 నుంచి రూ.58, బెంగళూరులో రూ.56 నుంచి రూ.60, చెన్నైలో రూ.55 నుంచి రూ.60 మధ్య పలుకుతుంది. ప్రస్తుతం ప్రధాన నగరాల్లో కిలో చక్కెర సగటు చిల్లర ధరలు రూ.44 నుంచి రూ.62 మధ్య ఉన్నాయి. స్థానిక రవాణా ఖర్చులు, నాణ్యతా గ్రేడ్, ప్రాంతీయ టోకు మార్కెట్లను బట్టి ధరలు మారుతూ ఉంటాయి. దేశీయ మార్కెట్లో చక్కెర ధరలు పెరగడంతో ప్రభుత్వం 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. దేశీయంగా తగినంత లభ్యతను నిర్ధారించడానికి, నిల్వలను అరికట్టడానికి కూడా ఇది వివిధ చర్యలు తీసుకుంది. వీటిలో చక్కెర డీలర్లపై నిల్వ పరిమితులు విధించడం, బల్క్ వినియోగదారులు నిల్వ చేసుకోగల చక్కెర పరిమాణాన్ని నియంత్రించడం వంటివి ఉన్నాయి.



# మహిళలకు స్ఫూర్తినిస్తుంది

'అమీర్‌లోగ్' చిత్రంలో తాను పోషించిన పాత్ర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని చెప్పింది కథానాయిక వేదా జలంధర్. హైదరాబాద్ బస్తీ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి రమణా రెడ్డి సోము దర్శకత్వం వహించారు. ఈ నెల 21న రానా 'స్పిరిట్' మీడియా ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక వేదా జలంధర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపిస్తానని, ముక్కుసూటిగా మాట్లాడటం తన నైజమని చెప్పింది. 'ఈ సినిమా రిలీజైన తర్వాత ప్రతీ ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుకుంటారు. హైదరాబాద్ నేటివిటీని ప్రతిబింబించే అద్భుతమైన కథ ఇది. ప్రతీ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఆరేళ్లయింది. 'అమీర్‌లోగ్' తప్పకుండా నా కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది' అని వేదా జలంధర్ తెలిపింది.

# మోడ్రన్ మిస్సమ్మ కథ



హర్ష నర్రా, తన్మయి, ఖుషి, సిజా విజయ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్సమ్మ'. సాయిబాబు దర్శకుడు. లాస్య అండ్ మిత్రన్ క్రియేషన్స్ తెరకెక్కిస్తున్నాయి. బుధవారం ఈ సినిమాలోని 'బెటర్ లీ ఏ మిస్సమ్మ' అనే తొలిపాటను విడుదల చేశారు. గోపీ సుందర్ స్వరపరచిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. 'కథను నమ్మకంతో ఈ సినిమాకు 'మోడ్రన్ మిస్సమ్మ' అనే టైటిల్ పెట్టాం. పెళ్లి నేపథ్యంలో అద్భుతంగా ఆసక్తికరంగా సాగే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేశాం' అని దర్శకుడు తెలిపారు. నేటి ట్రెండ్‌కు తగిన సినిమా ఇదని నిర్మాత చిరంజీవి పమిడి పేర్కొన్నారు.




# అక్కినేని త్రయం అదరగొట్టే లుక్స్..

## 'వెరైటీ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై నాగ్, చైతూ, అఖిల్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం (అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్) తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. అతి త్వరలో రాబోయే ఈ ప్రత్యేక సంచిక కోసం అక్కినేని హీరోలు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో వారు సినిమా రంగంలో తమ కుటుంబం సాధించిన అరుదైన విజయాలు, కొన్ని దశాబ్దాల సినీ ప్రయాణం, నాటి అనుభవాలు మరియు నేటి తరానికి సంబంధించిన ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. అత్యంత ఆకర్షణీయమైన దుస్తుల్లో, స్టైలిష్ అప్పియరెన్స్‌తో ఉన్న ఈ అక్కినేని హీరోల ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ మూవీకి క్రేజీ టైటిల్.. 'జనవరి 12 విడుదల'

అనిల్ రావిపూడి ప్రమోషన్స్ అంటే మామూలుగా ఉండవు.. తన సినిమాల ప్రచారంలోనూ కొత్తదనం చూపించే ఆయన.. తాజాగా మరోసారి తనదైన స్టైల్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమాకు టైటిల్ ప్రకటించే విషయంలోనూ ఓ ఫన్నీ ఐడియాను తీసుకొచ్చారు. టైటిల్‌తో పాటు సినిమా విడుదల తేదీని కూడా ఒకేసారి రివీల్ చేసి ఆసక్తి పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ బావా బామ్మర్ది పాత్రల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించింది. 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసింది. అంతేకాదు.. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే క్యాప్షన్‌ను కూడా జత చేసింది. టైటిల్ వినగానే ఇది సినిమా విడుదల తేదీ అనుకుంటారు.. అదే సినిమా పేరుగా ఉండటం విశేషం. టైటిల్ ప్రకటన కోసం రూపొందించిన వీడియోలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి.. అనిల్ రావిపూడిని సినిమా పేరేంటని అడుగుతారు. అందుకు ఆయన పదే పదే 'జనవరి 12 విడుదల' అని చెబుతుంటారు. తొలుత అది రిలీజ్ డేట్ అని భావించిన హీరోలు.. చివర్లో అదే సినిమా టైటిల్ అని తెలుసుకుని సరదాగా స్పందిస్తారు. టైటిల్ రివీల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రముఖ దర్శకుడు ఇవీవీ సత్యనారాయణకు ప్రత్యేకంగా నివాళి అర్పించారు. ఇవీవీ తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా వీడియోను రూపొందించారు. ఇలా తన కామెడీ మార్క్‌తో పాటు పాత తరం హాస్యాన్ని కలిపి టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను కూడా ఓ ఎంటర్‌టైనింగ్ వీడియోగా మార్చారు.

